

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ కల్చరల్, జనవరి 19 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బి. రమేష్ మాట్లాడుతూ... కోడి గుడ్డు ధర, నిత్యావసరాల ధరలు పెంచడంతో పాటు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని, యూనిఫాంలను సమకూర్చాలని, పలు సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనట్లయితే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. లక్ష్మి, మొనవ్వా, రమ, రజిత పాల్గొన్నారు.

డి-1 దందాపై విజిలెన్స్





న్యూ సాంగ్వి ఎక్స్‌రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు (ఫైల్)

- సీరియస్‌గా దృష్టి సారిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే
- నకిలీ వివరాలను ఆరా తీస్తున్న అధికారులు
- తీగలాగితే కదలనున్న డొంక
- 2017 నుంచి నకిలీ పట్టాలపై ఆరా
- బినామీల పేర్లతో భారీగా దందా
- అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతలే ప్రధాన సూత్రధారులుగా అనుమానాలు

నిర్మల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోట్లాది రూపాయల విలువైన డి-1 పట్టాల దందాపై ఎట్టకేలకు అధికార యంత్రాంగం కొరడా ఝులిపించబోతోంది. ఈ మేరకు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇప్పటికే డి-1 పట్టాల అక్రమాలపై అలాగే బినామీల దందాపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడమే కాకుండా జిల్లా యంత్రాంగానికి సైతం సమాచారం ఇచ్చారు. అలాగే విజిలెన్స్ విచారణ చేపట్టాలంటూ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేకంగా సర్కారుకు నివేదించారు. ఎమ్మెల్యే ఈ అంశంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకువస్తున్న కారణంగా వారం రోజుల్లోగా ప్రభుత్వం డి-1 పట్టాల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధం చేస్తోందని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ప్రభుత్వం ధరణిలో జరిగిన భారీ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకునేందుకు కసరత్తులు చేపట్టిన నేపథ్యంలోనే డి-1 పట్టాల దందాపై కూడా ఫోకస్ పెడుతోందని అంటున్నారు. ఈ డి -1 పట్టాల దందా లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలే ప్రధాన సూత్రధారులుగా కొనసాగారన్న బహిరంగ ఆరోపణలున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గతంలో కూడా డి-1 పట్టాలపై అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా సర్వేనంబర్‌లతో సహా అక్రమ భూముల వ్యవహారాన్ని వెల్లడించారు. మొదటి నుంచి డి-1 పట్టాల భూముల అక్రమాలపై సీరియస్‌గా ఉన్న మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవగానే ఈ అక్రమాలపై చర్యలు జరిపించేందుకు సిద్ధమయ్యారు. ఆయన ఇప్పటికే డి-1 పట్టాల భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సర్వే నంబర్‌లు, బినామీల వివరాలన్నింటినీ సేకరించి ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సంబంధిత అధికారులపై పెద్దఎత్తున ఒత్తిళ్లు తెచ్చి విచారణలు జరగకుండా అడ్డుకోగలిగిందన్న ఆరోపణలున్నాయి. అయితే బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందిన కారణంగా ఇక ఆ పార్టీ నేతల అక్రమాలన్నింటినీ బట్టబయలు చేసేందుకు ఇటు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో పాటు అటు కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం రంగంలోకి దిగబోతున్నారంటున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాత్రం ఎన్నికల ప్రచారంతో పాటు ఇతర కార్యక్రమాలు, సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకుంటూ విమర్శించిన ప్రతిసారి డి-1 పట్టాల అక్రమాలనే ప్రధానఅస్త్రంగా చేసుకున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు కావడం, మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో డి-1 పట్టాల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో స్థానిక అధికారులతో కాకుండా భూ విభాగానికి సంబంధించిన విజిలెన్స్ అధికారుల చేత డి -1 పట్టాల అక్రమాలపై విచారణ జరిపించాలంటూ ఎమ్మెల్యే తన వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొద్దిరోజుల క్రితమే రెవెన్యూ అధికారులు, సర్వేల్యాండ్ రికార్డ్స్ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి భూముల అక్రమాలపై తనకు పూర్తిస్థాయి నివేదికలు అందించాలంటూ కోరిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అధికారులు రికార్డుల సేకరణలో నిమగ్నమయ్యారు. 2014 నుంచి 2018 సంవత్సరం వరకు నకిలీ డి-1 పట్టాలను పెద్ద ఎత్తున సృష్టించారంటున్నారు. కొంతమంది బీఆర్ఎస్ స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆ పార్టీ నేతలు నిర్మల్‌లోని ఓ సర్వేయర్ సహకారంతో పెద్దఎత్తున నకిలీ డి-1 పట్టాలను పొందారంటున్నారు. నిజామాబాద్‌లోని ఎస్సారెస్పీకి సంబందించిన డిప్యూటీ కలెక్టర్ పేరిట తప్పుడు రికార్డులతో ఈ పట్టాలు జారీ అయ్యాయంటున్నారు. నకిలీ డి-1 పట్టాలను పొందిన వారి పేరిట ఇక్కడి ఓ సర్వేయర్ సహకారంతో అక్రమ సేత్వారీలు సృష్టించి విలువైన భూములను కాజేశారన్న ఫిర్యాదులున్నాయి. చాలా చోట్ల ఆయా గ్రామస్థులు నకిలీ డి-1 పట్టాల అక్రమాలపై అప్పట్లో ఆందోళనలు చేసినప్పటికీ అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతల ఒత్తిడితో అధికారులు ఆశించిన మేరకు స్పందించలేదన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మహేశ్వర్‌రెడ్డి ఒక మొత్తం డి -1 పట్టాల అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించేందుకు పట్టుదలతో ఉన్నారంటున్నారు. ఎమ్మెల్యే ఒత్తిడితో ప్రభుత్వం ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరిపించే దిశగా కార్యచరణ చేపట్టబోతోందంటున్నారు.

ఎమ్మెల్యే ఒత్తిడి మేరకే విజిలెన్స్

కాగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఒత్తిడి మేరకే అక్రమ డి-1 పట్టాల భూముల వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధమవుతోందంటున్నారు. ఈ డి-1 పట్టాల అక్రమ దందాలో అప్పటి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, స్థానిక నేతలతో పాటు అప్పటి మంత్రి బంధువులపై కూడా ఆరోపణలున్నాయి. అప్పట్లో ప్రతిపక్ష నాయకుడిగా మహేశ్వర్ రెడ్డి మంత్రిని టార్గెట్ చేస్తూ ఆధారాలను వెల్లడించడమే కాకుండా విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేశారు. అప్పటి మంత్రి ఒత్తిడి మేరకు డి-1 పట్టాల అక్రమాలపై విచారణ చేపట్టేందుకు అధికారులు సాహసం చేయలేకపోయారంటున్నారు. దీనిపై మహేశ్వర్‌రెడ్డి సర్వేనంబర్‌లు, సంబందిత ఎకరాలు అలాగే భూములను కొల్లగొట్టిన బినామీల వివరాలను సైతం ఆధారాలతో సహా బహిరంగంగా వెల్లడించారు. అయినప్పటికీ అధికారులు ఈ అక్రమాల వైపు దృష్టి సారించలేకపోయారంటున్నారు. ఈ క్రమంలోనే మహేశ్వర్‌రెడ్డి డి-1 పట్టాలతో అక్రమంగా భూములు పొందిన వారిపై చర్యలతో పాటు విజిలెన్స్ విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించనట్లయితే తాను ఈ అక్రమాలపై హైకోర్టును ఆశ్రయిస్తానంటూ కూడా ప్రకటించారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం పెద్దగా స్పందించకపోవడం మహేశ్వర్ రెడ్డి ఆరోపణలకు బలం చేకూర్చినట్లయ్యిందంటున్నారు.

ఆందోళనలు సైతం బేఖాతరు

బీఆర్ఎస్ పార్టీకి చెందిన అప్పటి మంత్రి బంధువులతో పాటు ఆ పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల గ్రామ స్థాయిలోని నాయకులు డి-1 పట్టాల పేరిట భూములను కాజేశారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఆయా గ్రామస్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేయడమే కాకుండా కలెక్టరేట్‌ను సైతం ముట్టడించి నిరసనలు తెలిపారు. అలాగే అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ సైతం కోరారు. మామడ మండలం న్యూలింగంపల్లిలోని సర్వే నంబర్ 18కి సంబంధించి అనేక బైనంబర్‌లను సృష్టించి అధికార పార్టీ ముఖ్య నేతలకు సంబంధించిన బంధువులు దాదాపు వంద ఎకరాల భూములను తమ పేరిట రికార్డులు సృష్టించుకున్నారంటున్నారు. అలాగే లోకేశ్వరం మండలం, దిలావర్‌పూర్ మండలం, లక్ష్మణచాంద మండలం, సోన్ మండలం తదితర మండలాల్లో సైతం ఇదే తరహా అవకతవకలు పెద్దఎత్తున జరిగాయంటున్నారు. నిర్మల్ మండలంలోని పలు గ్రామాల్లో కూడా అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతలు ఈ తతంగాన్ని పెద్దఎత్తున కొనసాగించారంటున్నారు. ముజ్గి, సిద్దిలకుంట, న్యూ వెల్మల్‌తో పాటు రత్నాపూర్‌కాండ్లితో పాటు తదితర గ్రామాల్లో నకిలీ డి-1 పట్టాల పేరిట అప్పటి అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్దఎత్తున డి-1 పట్టాల పేరిట భూములను కాజేశారంటున్నారు. మొత్తానికి డి-1 పట్టాల అక్రమాల వ్యవహారంపై విజిలెన్స్ విభాగానికి సంబందించిన అధికారులు కొద్ది రోజుల్లోనే రంగంలోకి దిగబోతున్న కారణంగా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయంటున్నారు.



కేంద్ర ప్రభుత్వ సహకారంతో పల్లెల ప్రగతి

- న్యూ లోలం జీపీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



న్యూ లోలంలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

దిలావర్‌పూర్, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వ సహకారంతో పల్లెల్లో ప్రగతికి పునాదులు పడుతున్నాయని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి న్యూ లోలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పల్లెల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఇతోధిక నిధులు మంజూరు చేస్తుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టించాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టారని చెప్పారు. నేను ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని తప్పకుండా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. కనివిని ఎరుగని రీతిలో అఖండ మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపిన నిర్మల్ నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. నా ఊపిరి ఉన్నంత కాలం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానన్నారు. కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సవిత, మాజీ ఎమ్మెల్యే ఎన్. ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీపీ అక్షర అనిల్, జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ సరిత, ఎంపీవో అజీజ్ ఖాన్, స్థానిక నాయకులు, ఉప సర్పంచ్ నరేందర్, మంద మల్లేష్, ఉదయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జరదేఖో..

రోడ్లు వేశారు మొరం మరిచారు

నర్సాపూర్(జి), జనవరి 19 మండల కేంద్రంలో గత సంవత్సరంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, డ్రేనేజీ పనులు సంవత్సరం కావస్తున్నా మొరం వేయక పోవడంతో రోడ్డుపై నుంచి వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు. వెంటనే మొరం వేయాలని కాంగ్రెస్ నాయకులు అజీమ్, గాదె సంతోష్ డిమాండ్ చేశారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు మొరం వేయక పోవడతో పశువులు, వాహనాల రాకపోకలతో ధ్వంసం అవుతున్నాయని అధికారులు వెంటనే చర్యలు తీసు కోవాలన్నారు.




సీసీ రోడ్డు మొరం వేయకుండా వదిలిపెట్టిన దృశ్యం

పంచాయతీరాజ్ ఏఈ సూరతేజగౌడ్ వివరణ

సీసీ రోడ్లకు మాత్రమే ఎస్టిమేట్ వేశామని మొరం పనులు చేయాలంటే గ్రామ పంచాయతీ నిధులు లేకపోవడంతో ఆలస్యమైందని తెలిపారు.

'విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం'



కుంటాల, జనవరి, 19: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఈ చౌహన్ అన్నారు. శుక్రవారం కల్లూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. వాటిని వెంటనే పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్య, విద్యుత్ శాఖ ఏఈలు శివప్రసాద్ తోపాటు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి స్పెషల్ క్యాంపెయిన్ డే

నిర్మల్ టౌన్, జనవరి 19 : సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా తెలంగాణ ఎన్నికల ముఖ్యఅధికారి వికాస్‌రాజ్ వివిధ జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటరు నమోదు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, కొత్త ఓటరు కార్డులను ముద్రించి పంపిణీ చేయాలని సూచించారు. అంతేకాకుండా జనవరి 20, 21 తేదీల్లో ఓటరు నమోదు, ఓటరు జాబితాలోని తప్పుల సవరణకు స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించాలన్నారు., దీనికి సంబంధించి బీఎల్‌వో నుంచి ప్రతీ ఒక్క అధికారి అందుబాటులో ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జనవరి 20, 21 తేదీలలో నిర్వహించబడే స్పెషల్ క్యాంపెయిన్ డేలో ప్రతి బీఎల్‌వో పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉండాలని అంతే కాకుండా ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రతి ఏఈ ఆర్‌వో కనీసం 10 నుండి 15 పోలింగ్ బూత్‌లు సందర్శించాలని దరఖాస్తులలో ఏవైనా తప్పులు దొర్లితే వెంటనే సరిచూడాలని, బీఎల్‌వోలకి సూపర్‌వైజర్లకి సూచించాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉండి కొత్త ఓటరు నమోదు జాబితాలో తప్పుల సవరణ కోసం వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని పేర్కొన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు, ఓటరు జాబితాలో తప్పులు దొర్లిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు కిశోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కొత్త ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి : కలెక్టర్


నిర్మల్ కల్చరల్, జనవరి 19 : 18 ఏళ్ల వయస్సు గల ప్రతి ఒక్కరూ ఈ నెల 20, 21న ప్రత్యేక శిబిరంలో పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో జాతీయ ఓటరు దినోత్సవంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఓటరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తప్పనిసరిగా ప్రతి బూత్‌లో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలన్నారు. ఓటర్లను చైతన్యపర్చాలన్నారు.

ముందస్తు అడ్వాన్సుల

రికవరీల జాప్యంపై కలెక్టర్ సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- జిల్లా వ్యాప్తంగా 89 మంది సర్పంచ్‌లకు నోటీసుల జారీ
- మూడు రోజుల్లో ఆలస్యం ఎందుకు అయ్యిందనే అంశంపై వివరణ ఇవ్వాలంటూ ఆదేశం
- శ్మశాన వాటికల నిర్మాణం కోసం తీసుకున్న అడ్వాన్సుల్లో ఇంకా రూ. 1.18 కోట్ల బకాయిలు
- ఇంకా లెక్క తేలని డంపింగ్ యార్డ్‌ల అడ్వాన్సుల బకాయిల జాబితా


మె 140 / KS / 2020
తేది : 17.01.2024
నోటీసు
సెక్షన్ 37 (v) (5)

బకాయిలు ఉన్న సర్పంచ్‌లకు డీపీవో జారీ చేసిన నోటీసు



ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం (ఫైల్)

ఖానాపూర్, జనవరి 19 : 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈ నెల 15న 'ముందస్తు అడ్వాన్సులు రికవరీ అయ్యేనా...?' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికార యంత్రాంగం స్పందించింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆరా తీసినట్లు తెలిసింది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా ఎంతమంది సర్పంచ్‌లు తీసుకున్న అడ్వాన్సులను తిరిగి చెల్లించలేదని వివరాలను పంచాయతీ అధికారుల నుండి కలెక్టర్ సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. డంపింగ్ యార్డ్‌లు, స్మశాన వాటిక నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ నిధుల నుంచి తీసుకున్న సర్దుబాటు డబ్బులను తిరిగి చెల్లించడంలో ఎందుకు జాప్యం అయ్యిందని కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్మశాన వాటిక నిర్మాణం కోసం అడ్వాన్సులు తీసుకున్న సర్పంచ్‌ల నుంచి ఇంకా 89 మంది సర్పంచ్‌లు తిరిగి డబ్బులు చెల్లించలేదని జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తెలిపారు. డంపింగ్ యార్డ్‌ల నిర్మాణం కోసం అడ్వాన్సులు తీసుకున్న వారి జాబితాను పరిశీలిస్తున్నామని వారిలో ఎంతమంది తిరిగి చెల్లించలేదనే లెక్క తేలుస్తామన్నారు. స్మశాన వాటిక తలుపు తీసుకున్న అడ్వాన్సు డబ్బులను తిరిగి చెల్లించని 89 మంది సర్పంచ్‌లకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసులు అందిన మూడు రోజుల్లో ఎందుకు డబ్బుల చెల్లింపులో జాప్యం జరిగిందని అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని సర్పంచ్‌లను కలెక్టర్ ఆదేశించినట్లు డీపీవో తెలిపారు. నోటీసులు తీసుకున్న సర్పంచ్‌లు మూడు రోజుల్లోపు వివరణ ఇస్తే అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా డంపింగ్ యార్డ్‌లు, స్మశాన వాటికల నిర్మాణం కోసం 327 మంది సర్పంచ్‌లు అడ్వాన్సులు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా స్మశాన వాటికల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ నిధుల నుండి అడ్వాన్సులు తీసుకున్న వారిలో ఇప్పటి వరకు 89 మంది తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించలేదని లెక్క తేల్చారు. డంపింగ్ యార్డ్‌ల నిర్మాణం కోసం తీసుకున్న అడ్వాన్సు డబ్బుల నుండి ఎంత మంది తిరిగి చెల్లించలేదనేది మాత్రం ఇంకా అధికారుల వద్ద సరైన లెక్కలు లేకపోవడం కొసమెరుపు.

సంక్షిప్త సమాచారం

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



భైంసా రూరల్, జనవరి 19 : మండలంలోని మహాగాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... చందుల పోశెట్టి(38) మహాగాం, చింతల్‌బోరి రహదారి మధ్యలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత సంవత్సరం నుండి భార్యతో వేరుగా ఉంటున్నాడు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలు కారణమని ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.


భార్య ఆత్మహత్యకు

కారణమైన భర్తకు జైలు

లక్ష్మణచాంద, జనవరి 19 : మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన కుంట్ల పరమేశ్వర్‌కు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిన సంఘటన శుక్రవారం తెలిసింది. ఎస్సై సల్లా శ్రీకాంత్ వివరాల ప్రకారం... నిర్మల్‌లోని శాంతి నగర్‌కు చెందిన ఎర్ర కావ్య(24), పరమేశ్వర్(25)లు మూడు సంవత్సరాలుగా ప్రేమించుకొని 2019 నవంబరు ఒటవ తేదీన నిజామాబాద్ పట్టణంలోని మధురా నగర్‌లో గల కోదండ రామాలయంలో వివాహం చేసుకున్నారు. పెళ్లయిన తర్వాత రెండు మూడు నెలలు సజావుగా కాపురం చేశారు. ఆ తర్వాత రూ. 5 లక్షలు వరకట్నం ఇవ్వాలని భర్త పరమేశ్వర్, బావ ఉమామహేశ్వర్లు కావ్యను శారీరకంగా మానసికంగా హింసించారు. ఈ హింసను భరించలేక రాచాపూర్ గ్రామంలో గల అత్తవారింట్లోనే దూలానికి ఉరి వేసుకొని కావ్య చనిపోయింది. దీంతో కేసు నమోదు చేసి అప్పట్లోనే కోర్టుకు సరెండర్ చేశారు. కేసు విచారణ అనంతరం పలువురు సాక్షులను పరిశీలించి భర్తతో పాటు బావ అయిన ఉమా మహేశ్వర్‌కు కూడా 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3 వేలు జరిమానా విధించినట్లు ఆయన వివరాలు వెల్లడించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన

ఇసుక డంపుల సీజ్




ఖానాపూర్, జనవరి 19 : అక్రమ ఇసుక రవాణాపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అక్రమ ఇసుక రవాణాపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని ఎర్వచింతల్, కొలంగూడ, పాత ఎల్లాపూర్ గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. దీంతో మూడు గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేసినట్లు ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపారు. సీజ్ చేసిన ఇసుక సుమారు 100 ట్రాక్టర్ ట్రిప్పులకు పైగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 300ల క్యూబిక్ మీటర్ల వరకు అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచినట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ పరిమళ్ బౌమిక్, ఎస్సై లింబాద్రితో పాటు మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ తదితరులున్నారు.





మహారాణా ప్రతాప్‌సింగ్‌కు ఘన నివాళి

నిర్మల్ అర్బన్, జనవరి 19 : జిల్లా కేంద్రంలో మహారాణా ప్రతాప్ 427వ వర్ధంతిని రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిర్మల్‌లోని మినీ ట్యాంక్‌బండ్‌పై ఉన్న మహారాణా ప్రతాప్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహారాణా ప్రతాప్ రాజపుత్ర వంశంలో జన్మించిన మహావీరుడని తెలిపారు. మేవార్ సంస్థానం ద్వారా తన రాజ్యాన్ని పరిపాలించాలని, ఆయన హయాంలో అక్బర్‌తో పోరాటం చేసిన హల్దీ ఘాట్ యుద్ధం చరిత్రలో నిలిచిపోయిందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ మహారాణా ప్రతాప్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు లక్ష్మణ్‌సింగ్, గౌరవ అధ్యక్షులు గజేం దర్‌సింగ్, సభ్యులు సాయిసింగ్, సుశీల్‌సింగ్, ఆనంద్‌సింగ్, రోహిత్‌సింగ్, మిథున్‌సింగ్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




మహారాణా ప్రతాప్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎస్పీని కలిసిన బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, జనవరి 19 : నిర్మల్ జిల్లా నూతన ఎస్పీ జానకి షర్మిలను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలుసుకొని పుష్పగుచ్ఛం అందించారు. శాలువాతో సన్మానించి అభినందించారు. జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాచకొండ సాగర్, సాధం అరవింద్, డి. ముత్యంరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి'

నిర్మల్ కల్చరల్, జనవరి 19 : అంగన్‌వాడీల్లో టీచర్లు, హెల్పర్ల ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమావేశం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో రొటేషన్ ట్రాక్ రద్దు, 14 రిజిస్టర్లు రాయడం లాంటివి ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకమని తెలిపారు. రాజకీయ జోక్యం తగ్గించాలన్నారు. ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. ఒప్పందాలను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. రమాదేవి, రాణి, జయంతి, దయ సాగరి, అర్చన, తదితర అంగన్‌వాడీ నాయకులు పాల్గొన్నారు.













మా సంకల్పం వికసిత భారతం : ఎంపీ

నేరడిగొండ, జనవరి 19: మా సంకల్పం వికసిత భారతమని ఎంపీ సోయం బాపురావు అన్నారు. మండలంలోని నాగమల్యాల్ గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. నవభారత్ నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఔనత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతి జ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అధికారుల ద్వారా అవగాహన కల్పించారు. భీమా ఆరోగ్య కార్య క్రమాలపై సంబంధిత అధికారులు ప్రజలకు వివరించారు. ఈ సంద ర్భంగా ఎల్ఈడీ స్ర్కీన్ ద్వారాకేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు మోదీ సందేశాన్ని వీడియో రూపంలో ప్రజలకు వినిపించారు. ఈ కార్యక మంలో నోడల్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, దక్షిణ రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, బీజేపీ జిల్లా నాయకులు గొర్ల రాజుయాదవ్, పార్టీ మండ ల కన్వీనర్ సోనయ్య హీరాసింగ్, బీజేపీ నాయకులు తొడసం శంకర్, ప్రశాంత్, హెచ్ఈవో హరికుమార్ గౌడ్, సర్పంచ్ గై భీముడు, పంచా యతీ కార్యదర్శి గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అయోధ్య అక్షింతల అందజేత

ఉట్నూర్, జనవరి 19: ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్‌కు మండల విశ్వ హిందూ పరిషత్ సభ్యులు శుక్రవారం అయోధ్య శ్రీరామ మందిరం అక్షింతలను అందజేశారు. ఈనెల 22న అయోధ్యలో జరుగనున్న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్ర మం సందర్భంగా అయోధ్య నుంచి ఇంటింటికీ రాములవారి అక్షింతల ను చేరవేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో సాడిగే రాజగోపాల్, లింగన్న, రామిని నాగన్న, కొండగట్టు అంజన్న, పొచన్న షావుకారి, చింతకాయల భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు వెళ్లిన యోగానంద సరస్వతి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 19: అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి జిల్లా ప్రజల తరఫున ప్రతినిధిగా శ్రీగోపాలకృష్ణ మఠం పీఠాధిపతి శ్రీయోగానంద సరస్వతి అయోధ్యకు బయలుదేరి వెళ్తున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి బయలుదేరిన యోగానంద సరస్వతి మాట్లాడుతూ మహా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తనకు దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉందని, శ్రీరాముడి ఆశీర్వాదం ఏఒక్క శాతం దొరికిన అది మనందరి మహా భాగ్యమని అన్నారు.



బోథ్‌లో మాట్లాడుతున్న ఎంవీఐ మహేష్

'ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి'

బోథ్, జనవరి 19: వాహనాల డ్రైవర్లు తగు జాగ్రతలు తీసుకొని వాహనాలు నడపాలని ఎంవీఐ మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని వాహనం నడపాలన్నారు. వర్షాకాలంలో విడుదలపై నుండి నీరు ప్రవహించినప్పుడు ఎట్టి పరిస్థితిలో వాగులను దాటవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎంవిఐ రవీందర్, బోథ్ ఎస్సై రాము సిబ్బంది ప్రీతం బోథ కానిస్టేబుల్ కొండ లక్ష్మణ్, రామ్మూర్తి, వామన్ లక్ష్మణు, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన క్రీడా సంబరాలు

● ఉట్నూర్‌లో కొనసాగుతున్న ఐఎస్ఎల్ క్రీడా పోటీలు

ఉట్నూర్, జనవరి 19: రాష్ట్రంలోని ప్రభుత్వ సొసైటీ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇంటర్ సొసైటీ లీగ్ పోటీల క్రీడా సంబరాలు అంబరాన్ని అంటాయి. మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఈనెల 17 నుంచి ప్రారంభమైన ఏడువ ఐఎస్ఎల్ పోటీలలో 3500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. అథ్లెటిక్స్‌తో పాటు వాలీబాల్ కబడ్డీ హాకీ ఫుట్‌బాల్ లాంటి 17 ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. కొమురంభీం ప్రాంగణంలోని క్రీడా మైదానాలలో రంగురంగుల దుస్తులు ధరించి క్రీడాకారులు తిరుగుతుంటే అక్కడి వాతావరణం ఆహ్లాదంగా కనిపిస్తుంది. అండర్-17 బాలుర 1500 మీటర్ల రన్నింగ్‌లో సాంఘీక సంక్షేమ శాఖ జేపీ నగర్ విద్యార్థి సంతోష్ బంగారు పథకం, మహాత్మ జ్యోతిబాపూలే మహబూబ్‌నగర్ విద్యార్థి బసంత్ వెండి పతకం, గిరిజన సంక్షేమ సొసైటీ దేవరకొండ విద్యార్థి హాజ్యనాయక్ కాంస్య పతకం సాధించారు. అలాగే అండర్-17 బాలుర డిస్క్‌త్రోలో ఆత్మ జ్యోతిబాపూలే మహబూబ్‌నగర్ విద్యార్థి రామకృష్ణ బంగారు, తెలంగాణ మైనార్టీ రెసిడెన్స్ ఖమ్మం విద్యార్థి మొబిన్ వెండి, మహబూబ్‌నగర్ మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే విద్యార్థి మురళీ కృష్ణ కాంస్య పతకం సాధంచారు, అండర్-19 బాలుర 1500 మీటర్ల రన్నింగ్‌లో దేవరకొండ గిరిజన సంక్షేమ సొసైటీ విద్యార్థి సేనావత్ దోని బంగారు, సాంఘీక సంక్షేమ లింగాల విద్యార్థి శివకుమార్ వెండి, జ్యోతిబాపూలే మెడిక్ విద్యార్థి శ్రీశైలం కాంస్య, అలాగే అండర్-19 బాలుర హైజంప్‌లో భద్రాచలం స్టార్ విద్యార్థి వెంకటేశ్వరరావు బంగారు, సాంఘిక సంక్షేమ జైపూర్ విద్యార్థి రాజ్‌కుమార్ వెండి, గుండాల స్టార్ విద్యార్థి పవన్ కాంస్య, 17ఏళ్ల బాలికల డిస్కస్త్రోలో వికరాబాద్ సొసైటీకి చెందిన అంజలికి బంగారు, ఆదిలాబాద్ గిరిజన సొసైటీ లక్ష్మంపూర్ విద్యార్థిని సందారికి వెండి, మంచిర్యాల మందమర్రికి చెందిన జ్యోతిబాపూలే విద్యార్థిని జ్యోతికకు కాంస్య, 17 ఏళ్ల బాలికల 1500 మీటర్ల రన్నింగ్‌లో హైదరాబాద్ స్టార్‌కు చెందిన విద్యార్థిని దివ్యశ్రీ బంగారు పథకంతో పాటు తదితరులు వివిధ పతకాలను సాధించిన వారిలో ఉన్నారు.



కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై, డీటీడీవో



సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న బాలికలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికల జట్లు

● మెడల్స్ అందించిన అధికారులు

మూడు రోజులుగా జరుగుతున్న ఐఎస్ఎల్ క్రీడల్లో విజేతలకు శుక్రవారం అధికారులు మెడల్స్ అధించారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలను డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీఓ క్రాంతికుమార్, మంచిర్యాల డీటీడీఓ మడావి గంగారాం, ఉట్నూర్ ఎస్సై మనోహర్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మెస్రం మనోహర్, జిల్లా క్రీడల అధికారులు కోరెడ్డి పార్థసారథి, భుక్య రమేష్, బుండజివరత్నం, మీనారెడ్డిలు క్రీడాకారులను పరిచయం చేసుకోవ డంతో పాటు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పవర్ లక్ష్మణ్, రాథోడ్‌గోపాల్, జాదవ్ హేమంత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న ఐఎస్ఎల్ పోటీల సందర్భంగా అయా పాఠశాల కళాశాలల విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

మకర తోరణ నిర్మాణానికి భూమిపూజ

తలమడుగు, జనవరి 19: మత సంరక్షానికి నిలయం రుయ్యాడి పీరీలని విజయ డైరీ మాజీ ఛైర్మన్ హస్సేన్ హుస్సేన్ ఆలయ కమిటీ అధ్యక్షులు లోకభూమారెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో రూ.13లక్షలతో మకర తోరణం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా లోకభూమారెడ్డి మాట్లాడుతూ డిల్లీకి రాజైన తల్లికొ కొడుకే. ఉన్న ఊరు కన్న తల్లిని ఎవరు మర్చిపోకుండా గ్రామ ప్రతి కొరకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. రుయ్యాడి గ్రామానికి చెందిన గంగాధర్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటికి గ్రామ అభివృద్ధి కోసం రూ.13లక్షలు మకర తోరణ నిర్మాణానికి అందించడం అభినందనీయమన్నారు. గతంలోను మొహరం పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు హస్సేన్ హుస్సేన్ ఆలయ అభివృద్ధి కోసం గ్రామం కోసం ముందుకు ఆరవాలనికోరారు. అనంతరం ఆలయంలో భజా భజంత్రిలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 13లక్షలతో నిర్మిస్తున్న మకర తోరణ నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఇందులో సర్పంచ్ పోతారెడ్డి,సీఈఓ మోతేశ్రీనివాస్, గ్రామస్థులు అయ్యన్నసుభాష్, ప్రకాష్‌రెడ్డి, నెట్టిడి గంగాధర్, గ్రామస్థులు తదితరులున్నారు.



భూమిపూజ చేస్తున్న నాయకులు

'వినియోగదారులకు మెరుగైన సేవలు'

ఇంద్రవెల్లి, జనవరి 19: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉన్న ఖాతా దారుల నమ్మకం ఉద్యోగుల కృషి ఫలితంగా బ్యాంకు ప్రగతిపథంలో దూ సుకుపోతోందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్ర ఛైర్మన్ వైశోభ అన్నా రు. శుక్రవారం ముందుగా మండలంలోని కేస్లాపూర్ గ్రామాన్ని సందర్శించి ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని నూతన తెలంగాణ గ్రామీణ బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి, బ్యాంకు మేనేజర్ కృష్ణ, ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామరావు, సీసీలు పాల్గొన్నారు.

నేటితో సప్తాహ ముగింపు

తాంసి, జనవరి 19: గత వారం రోజుల నుంచి మండలంలోని వడ్డాడి గ్రామంలో నిర్వహిస్తున్న బాజీరావు సప్తహ కార్యక్రమం శనివారం ముగియనుంది. వారం రోజుల నుంచి వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఏకధాటిగా ఏడు రోజుల పాటు భక్తి కార్యక్రమాలు నిర్వహించడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి సైతం పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'అధికారులు సమయపాలన పాటించాలి'

తాంసి, జనవరి 19: ఆయా గ్రామాలలో వివిధ శాఖలో పనిచేస్తున్న అధికారులు, గ్రామాల కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేయాలని ఎంపీడీవో భూమయ్య ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, కారోబార్లు, ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత పెరిగినందున వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

'గడువు తీరిన శీతల పానీయాలను విక్రయిస్తే కఠిన చర్యలు'

సిరికొండ, జనవరి 19: గడువుతీరిన శీతల పానీయాలు, నిత్యావసర సరుకులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయబ్ తహసీల్దార్ ఉపేందర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఆర్ఐ విలాస్‌తో కలిసి పలు కిరాణషాపులను, స్వీట్ హోమ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటల్‌లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటల్‌లలో వాణిజ్య సిలిండర్లకు బదులు గృహవినియోగ సిలిండర్లను ఉపయోగించడంతో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువు తీరిన శీతలపానీయాలు, నిత్యావసర సరుకులు, స్వీట్ హోమ్‌లలో కల్తీ ఆహారపదార్థాలను వినియోగదారులు వాడినట్లయితే పలు అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. స్వీట్‌హోమ్‌లు, కిరాణ షాపుల్లో గడువుతీరిన సరుకులను విక్రయిస్తే సంబంధిత షాపు యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ విలాస్, సిబ్బంది పాల్గొన్నారు.



గృహ వినియోగ సిలిండర్‌లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసిన కాంట్రాక్టర్

● చొరవ తీసుకున్న తహసీల్దార్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

లక్ష్మణచాంద, జనవరి 19 : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో 'మిషన్ భగీరథ తవ్వకాలు - నిలిచిన ఆర్టీసీ బస్సు' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించబడిన వార్తపై తక్షణ స్పందన లభిం చింది. ఈ వార్త చదివిన కాంట్రాక్టర్ అబ్బిడి రంజిత్‌రెడ్డి ఉదయమే ఆంధ్రజ్యోతికి కాల్ చేశారు. కూలీల నిర్లక్ష్యం కారణంగా ఆలస్యం జరిగిందని, వెంటనే మరమ్మతులు పూర్తి చేస్తామని అన్నారు. తహసీల్దార్ శ్రీలత కూడా చొరవ తీసుకున్నారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంటలోపు మరమ్మతులు పూర్తి చేసి ఆర్టీసీ బస్సు రాకపోకలకు ఏర్పడిన అడ్డంకిని తొలగించారు. వెంటనే స్పందించి మరమ్మతులు పూర్తి చేసిన అధికారులు, కాంట్రాక్టర్‌కు స్థానిక సర్పంచ్ అడిచెర్ల రవికుమార్, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కథా ప్రక్రియపై విద్యార్థుల అధ్యయన పరికల్పన

నిర్మల్ టౌన్, జనవరి 19 : విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలను వెలికి తీసి సృజనాత్మకతను పెంపొందించే మంచి సంకల్పంతో జిజ్ఞాస విద్యాంస్థల అధ్యయన పరికల్పనను 2026లో ఉన్నత విద్యతో ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్ ప్రిన్సిపాల్ డా. జే. భీమ్‌రావు ప్రోత్సాహంతో తెలుగు విభాగం ఆధ్వర్యంలో టి. నర్సయ్య అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో నా నుంచి మన వరకు కథా సంపుటి - పరిశీలన అనే అంశాన్ని విద్యార్థుల పరికల్పనగా ఎన్నుకున్నారు. కథలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. ఒకప్పుడు చిన్న పిల్లలను నిద్రపుచ్చిన కథలు సమాజంలో ఏవిధమైన చైతన్యాన్ని కలిగిస్తాయి. అనే విషయాలను అధ్యయన అంశంగా పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా సాహితీ హృదయుడు, నవల కర్త, వ్యాస కర్త, పరిశోధకులు అయిన డా.టి. సంపత్ కుమార్‌ని కలుసుకొని వారి వ్యక్తిగత, సాహిత్య అంశాలను రచన గురించి విద్యార్థులు అనేక ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సంపత్ కుమార్ ఓపికగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. రచయిత సంపత్ తన మూడో కథా సంపుటి ప్రతిని అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పరికల్పన చేస్తున్న విద్యార్థులు నవ్య, యమునా, రఘు, తదితర విద్యాంస్థలు, పర్యవేక్షకులు టి. నర్సయ్య పాల్గొన్నారు.

'ఆ రోజు ప్రతి ఇంటా భక్తి భావం పెంపొందాలి'



రామ మందిర చరిత్ర తెలియజేసే జాగృతి పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, జనవరి 19 : అయోధ్యలో రామ మందిరం ప్రారంభం రోజు ఈ నెల 22వ తేదీన జిల్లాలోని ప్రతిఇంటిలో భక్తిభావం పెంపొందాలని కిష్టాబాయి - గన్యానాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ నాయకులు జాదవ్ రాజేష్‌బాబు అన్నారు. అందుకోసం ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో లక్ష కాషాయ జెండాలు, ప్రమిదలు, వత్తులు, డోర్‌స్టిక్కర్లు, రామమందిరం చరిత్ర తెలియజేసే జాగృతి పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం లోకేశ్వరంలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి ఆయన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేటి నుంచి ఈ నెల 21 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతా ల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. ఆ రోజు ప్రతి ఇంటిపైన కాషాయ జెండా ఎగరాలని, అలాగే ప్రతి ఇంటి ముందు ప్రమిదలు వెలిగించి రామభక్తిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నగరం నారాయణ రెడ్డి, చిన్నారావు, లక్ష్మణరావు, ఎం. శ్రీధర్, కే. ముత్యం, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలి

● నాసిరకం పనులు చేపడితే సహించేది లేదు
● ప్రభుత్వ పథకాల్లో పేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి
● ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం, జనవరి 19 : కొంత మంది అధికారులు పూర్తి సమాచారంతో సమావేశాలకు హాజరు కావడం లేదు. త్వరలో రివ్యూ మీటింగ్ తీసుకుంటాను దానికి సంబంధిత శాఖల అధికారులు అవగాహన కల్పించుకుని పూర్తి సమాచారంతో హాజరుకావాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ హెచ్చరించారు. శుక్రవారం మం డల పరిషత్ అధ్యక్షులు మామడి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య, వైద్యం, సాగునీరు సదుపాయాలు పూర్తిస్థాయిలో అందినప్పుడే ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, సాధారణ ప్రసవాలపై ఆయా గ్రామాల్లోని ఆశావర్కర్లతో గర్భిణీలకు అవగాహన కల్పించి ప్రోత్సహిం చాలని సూచించారు. మండలంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి పలు ఉపాధ్యాయులను ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపారని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుండి సర్దుబాటు చేయాలని ఎంఈవోకు సూచించారు. అలాగే గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందుతుందని వాటి నిర్వహణ సమర్థవ ంతంగా చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. చెరువుల శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పలుమార్లు రెవెన్యూశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కనకాపూర్ సర్పంచ్ నరేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన తహసీల్దార్‌ను ఆదేశిం చారు. అలాగే వ్యవసాయానికి ఎన్ని గంటల విద్యుత్ సరఫరా ఇస్తున్నారని సంబంధిత ఏఈని ఎమ్మెల్యే ప్రశ్నించగా 18 గంటలు ఇస్తున్నామని ఏఈ సమాధానం ఇచ్చారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. 200ల లోపు యూనిట్లు వినియోగించే గృహాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పినందున 200ల యూనిట్లకు పైగా వినియోగించే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో గైడ్‌లైన్స్ రాలేదని, అవి రాగానే ప్రజలకు తెలియజేస్తామని ఏఈ తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాల్లో పేద వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. పీపీ ఎత్తిపోతల పథకానికి ఇంకా రూ. 30 కోట్లు అవసరమవు తాయని అధికారులు నివేదికలు తయారు చేశారని, త్వరలో మంజూరు చేయించి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా మొదటిసారిగా మండలానికి వచ్చిన ఎమ్మెల్యేను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాల్మన్ రాజ్, తహసీల్దార్ మోతిరాం, పీఏసీఎస్ అధ్యక్షులు రత్నాకర్‌రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

దళితబంధు లబ్ధిదారుల అకౌంట్లలో డబ్బులు వేయాలి

● భైంసాలో అర్ధనగ్న నిరాహార దీక్ష చేపట్టిన లబ్ధిదారుడు

భైంసా, జనవరి 19: దళిత బంధు లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేస్తూ.. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన కొత్తూర్ శంకర్ అనే లబ్ధిదారుడు శుక్రవారం అర్ధనగ్న నిరాహార దీక్ష చేపట్టారు. భైంసాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ముథోల్ నియోజక వర్గ పరిధిలోని దళిత బంధు లబ్ధిదారులందరి బ్యాంక్ అకౌంట్లలో గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జమ చేయాలని కోరారు. ఈ నెల 22వ తేదీ వరకు లబ్ధిదారుల అకౌంట్లలో డబ్బులు జమ చేయని పక్షంలో భైంసాలో అమరణ నిరాహార దీక్ష చేపడుతానని ప్రకటించారు.



భైంసాలో అర్ధనగ్న నిరాహార దీక్ష చేపట్టిన కొత్తూర్ శంకర్

నిర్మల్ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 50 రోజుల పరుగు విజయవంతం

నిర్మల్ అర్బన్, జనవరి 19 : నిర్మల్ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 50 డేస్ ఆఫ్ రన్నింగ్ సక్సెస్ అయ్యింది. గత 50 రోజులుగా దిగ్విజయంగా సాగుతున్న సైక్లింగ్ క్లబ్ రన్నింగ్ రేస్ శుక్రవారంతో 50 రోజులు దాటింది. 21 కిలో మీటర్ల ఆఫ్ మారథాన్, 42 కిలో మీటర్ల ఫుల్ మారథాన్‌తో పాటు 200 నుండి 300 కిలో మీటర్ల సైకిల్ కార్యక్రమాన్ని నిర్మల్ సైక్లింగ్ క్లబ్ సభ్యులు చేపడుతున్నారు. 50 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ ప్రతినిధులు ఫణి రాజు, విక్టోరియా హాజరయ్యారు. చక్కని ఆరోగ్యం కోసం వ్యాయామంతో పాటు రన్నింగ్ సైక్లింగ్ అంశాలపై నిర్మల్ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్న నిర్మల్ సైక్లింగ్ క్లబ్ సభ్యులను అభినందించారు. 50 రోజుల రన్నింగ్ రేస్ విజయవంతంగా పూర్తి చేసిన సభ్యులకు మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ సైక్లింగ్ క్లబ్ అధ్యక్షులు రాకేష్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ బిఎల్. నరసింహా రెడ్డి, ప్రతినిధులు డాక్టర్ రఘునందన్ రెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ కృష్ణస్వామి, డాక్టర్ కావేటి శ్రీకాంత్, శ్రీరామ్ రాజు, కాసం రాజు, శరత్ రెడ్డి పాల్గొన్నారు.



మెడల్స్‌తో 50 డేస్ ఆఫ్ రన్నింగ్ పూర్తి చేసిన నిర్మల్ సైక్లింగ్ క్లబ్ సభ్యులు

విశ్రాంత ఇంజనీర్ల డైనందిని ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, జనవరి 19 : రాష్ట్ర విశ్రాంత ఇంజనీర్ల సంఘం నూతన 2024 డైనందిని శుక్రవారం విశ్రాంత సీఈ ఆనంద్‌రెడ్డి ఆవిష్కరించారు. విశ్వేశ్వరయ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కామారపు జగదీశ్వర్, నగేష్, జగదీశ్వర్‌రెడ్డి, వేంకటపతి, డిప్యూటీ ఈఈ రాజారెడ్డి, తదితర విశ్రాంత ఇంజనీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సారంగాపూర్, జనవరి 19 : మండల కేంద్రంలో గల ప్రభుత్వ పాఠశాలలో అయోధ్య రామ మందిరం ప్రారంభో త్సవాల్లో భాగంగా ఎంపీటీసీ పద్మ వీరయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చదువుతో పాటు భక్తిని పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.


సంతలో సమస్యలు తీర్చండి

బోథ్, జనవరి 19: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే సంతలో సమస్యలు నెలకొన్నాయని గ్రామ పంచాయతీ వారు సంతకు వచ్చిన వారికి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని బోథ్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బీజేపీ నాయకులు గంగన్న జక్కుల వెంకటేశులు విన్నవించారు. శుక్రవారం సర్పంచ్ సురేందర్ యాదవ్, ఉప సర్పంచ్ కట్ట పల్లవిలకు ఈ విషయమై వినతి పత్రం ఇచ్చారు. సంతలో వ్యాపారులకు అనేక ఇబ్బందులు ఉన్నాయని, మూత్ర శాలలు లేక సంతకువచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. వైపు సంతలోకి పశువులు ప్రవేశించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 22న రాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆలయాలను శుభ్రం చేయించాలని కోరారు. పల్లె ప్రకృతి వనానికి సరైన రోడ్డు వసతి లేదని ఫలితంగా నిరుపయోగంగా మారుతుంది అన్నారు. ఆదర్శ పాఠశాల కస్తూరిబా పాఠశాలల వద్ద విద్యుత్తు లైట్లు ఏర్పాటుచేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చూడాలని వారు వినతిపత్రంలో కోరారు. తై బజార్ వేలం ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకురుతున్న సంతకు వచ్చే వ్యాపారులకు మాత్రం వసతులు కల్పించకపోవడం వల్ల ఇబ్బందులు పాలవుతున్నారనే విషయం వివరించారు.

శివ మార్కండేయ ఆలయం శుభ్రం చేసిన భక్తులు


బోథ్, జనవరి19: అయోధ్య రామాలయంలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్నందున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలయాలను శుభ్రం చేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంలోని శివ మార్కండేయ ఆలయాన్ని శుక్రవారం భక్తులు శుభ్రం చేశారు ప్రధాని ఇచ్చిన పిలుపుమేరకు అన్ని గ్రామాల్లో ఆలయాలను శుభ్రం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 । కనిష్ఠం 18.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
శనివారం 20 జనవరి 2024



పత్తి కొనుగోళ్ల నిలిపివేత : కార్యదర్శి

సిరికొండ, జనవరి 19: ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల్లో సీసీఐ ద్వారా కొనుగోలు చేపడుతున్న పత్తి కొనుగోళ్లను శనివారం నుంచి ఆదివారం వరకు రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చోడ, గుడిహత్నూర్ పరిధిలోని జిన్నింగ్‌లలో పత్తి నిండుగా ఉండడంతో రైతులు ఆయా కేంద్రాలకు పత్తి విక్రయించడానికి తీసుకురావద్దని ఆయన పేర్కొన్నారు. తిరిగి సోమవారం నుంచి యధావిధిగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు.



● జిల్లాకేంద్రం పరిసర ప్రాంతాల్లోని చిల్కూరి లక్ష్మినగర్ కాలనీ సమీపంలో మాయవుతున్న గుట్టలు



గుట్టలు మాయం!

- జిల్లాలో అడ్డగోలుగా సాగుతున్న మొరం అక్రమ తవ్వకాలు
- బొందల గడ్డలుగా మారుతున్న అసైన్డ్ భూములు
- రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందల ట్రిప్పుల మొరం తరలింపు
- నిత్యం లక్షల రూపాయలు దండుకుంటున్న మైనింగ్ మాఫియా
- నేరడిగొండ, తలమడుగు, తాంసి, మావలతో పాటు ఆదిలాబాద్ పరిసర ప్రాంతాలల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- అభివృద్ధి పనుల పేరిట అక్రమ దందా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖల అధికారులు
- జిల్లావ్యాప్తంగా ఇసుక, మొరం తవ్వకాలపై ప్రత్యేక తనిఖీలు చేపడితే ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం



ఆదిలాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొరం అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మైనింగ్ మాఫియా ఆగడాలకు గుట్టలు మాయమవుతున్నాయి. అభివృద్ధి పనుల పేరిట దర్జాగా అక్రమదందా సాగుతున్న అడిగే వారే కరువవుతున్నారు. జిల్లాలోని నేరడిగొండ, తలమడుగు, తాంసి, మావల, జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాలల్లో యథేచ్ఛగా మొరం అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా నిత్యం వందల ట్రిప్పుల మొరం మట్టిని తరలిస్తున్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పేరిటా మొరం తవ్వకాలను జరుపుతు లక్షలు జేబులో వేసుకుంటున్నారు. ఈ దందా యథేచ్ఛగా జరుగుతున్నా.. సంబంధిత శాఖల అధికారులకు పట్టింపే లేకుండా పోతోంది. కనీసం అటువైపు కన్నెత్తయిన చూడడం లేదంటున్నారు. జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి భూములే ఉండడంతో అక్కడక్కడ ఉన్న ఎర్రమట్టి మొరానికి భారీగానే డిమాండ్ కనిపిస్తోంది. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టలు, అసైన్డ్ భూములను అడ్డంగా తవ్వేస్తున్నారు. ప్రైవేట్ పట్టా భూముల్లో తవ్వకాలు చేపడితే అధిక వ్యయం కావడంతో మైనింగ్ మాఫియా కన్ను అసైన్డ్ భూములపై పడింది. అంతేకాకుండా నేతలు, జిల్లా అధికారుల ఒత్తిళ్లు పెరిగిపోవడంతో రెవెన్యూ, మైనింగ్ శాఖలకు చెందిన అధికారులు కూడా వత్తాసు పలకాల్సి వస్తోంది. ఈ విషయమై ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలే కావడం గమనార్హం. ఇకనైనా మొరం అక్రమ తవ్వకాలపై ప్రత్యేకదృష్టిని సారించాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా యంత్రాగంపై విమర్శలు

అమాయక రైతులకు మాయమాటలు చెప్పి డబ్బులతో ఎర వేస్తూ బంగారు భూములను యథేచ్ఛగా కొల్లగొడుతున్నా.. జిల్లా అధికార యంత్రాంగం కళ్లు మూసుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం అందించిన అసైన్డ్ భూములు బొందలగడ్డలుగా మారిపోతున్నాయి. అసైన్డ్ చట్టం ప్రకారం ఈ భూముల్లో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరుపకూడదు. ఈ విషయం రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినా.. నోరు మెదపక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులతో పాటు మండల రెవెన్యూ అధికారుల వరకు మొరం తవ్వకాలను మాములుగానే తీసుకుంటున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారికి ఆనుకొని నిత్యం మొరం తవ్వకాల దందా సాగుతున్నా.. అధికారులకు మాత్రం కనిపించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అలాగే పట్టణ పరిసర ప్రాంతంలోని చిల్కూరి లక్ష్మినగర్ సమీపంలో ఉన్న అసైన్డ్ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు జరుగుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మండల పరిసర ప్రాంతాల్లో మొరం అక్రమ తరలింపు అడ్డగోలుగా సాగుతోంది. మొరం అక్రమ తవ్వకాలతో బొందల గడ్డలుగా మారుతున్న పేద రైతుల అసైన్డ్ భూములు పంటల సాగుకు అవకాశం లేకుండా పోతున్నాయి.

రాయల్టీ పన్ను ఎగవేత

మొరం తవ్వకాలపై రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి వచ్చే లక్షల రూపాయల ఆదాయానికి మైనింగ్ మాఫియా గండికొడుతోంది. యథేచ్ఛగా రాయల్టీ పన్నును ఎగవేస్తున్నారు. దీంతో నిత్యం లక్షల రూపాయల ఆదాయం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి పోతోంది. జిల్లాలో మొరం తవ్వకాల పైననే ప్రతియేటా కోట్ల రూపాయల ఆదాయానికి గండిపడుతున్నట్లు తెలుస్తుంది. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అసలు నిబంధనల ప్రకారం ఒక్కో క్యూబిక్ మీటర్‌కు కంకర తవ్వకాలపై రూ.75, మొరం తవ్వకాలకు రూ.30, ఇసుక తవ్వకాలకు రూ.40 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇది జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. ఫిర్యాదు వస్తేనే అడపాదడపా దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే, 300 ఫీట్ల సామర్థ్యం ఉన్న టిప్పర్‌లో ఆనే క్యూబిక్ మీటర్ల మొరాన్ని తరలించవచ్చు. (100 ఫీట్లకు క్యూబిక్ మీటర్) అంటే ఈ లెక్కన ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.30 చొప్పున ఆరు క్యూబిక్ మీటర్లకు రూ.180 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా నిత్యం వందల సంఖ్యలో ట్రిప్పుల మొరం తరలిపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి ఎంత నష్టం వాటిల్లుతుందో ఇట్టే స్పష్టమవుతుంది. జిల్లాలో ఇసుక, మొరం తవ్వకాలపై ప్రత్యేక తనిఖీలు చేపడితే లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరనుంది.



● టిప్పర్‌లో మొరాన్ని తరలిస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం



విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

'పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి'

తలమడుగు, జనవరి 19: మండలంలోని సుంకిడి పాఠశాలకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం హైదరాబాద్‌లో పాఠశాల విద్యా కమిషనర్ దేవసేనని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కలిసి విన్నవించారు. సుంకిడిలో జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, వర్షాకాలంలో తరగతులు రైతు వేదికలో నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయని, సత్వరమే నూతన పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట బజార్‌హత్నూర్ జడ్పీటీసీ మల్లెపూల నరసయ్య తదితరులున్నారు.

● సీఎంవో ప్రత్యేక కార్యదర్శిని కలిసిన గోక

హైదరాబాద్‌లో సెక్రటరియేట్ సీఎంవో కార్యాలయంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి గోపిడి చంద్రశేఖర్ రెడ్డిని జడ్పీటీసీలు గణేష్‌రెడ్డి, మల్లెపూల నరసయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని, వెనుకబడ్డ ఆదిలాబాద్ జిల్లాను ప్రత్యేకనిధులతో అభివృద్ధి పరిచేందుకు కృషి చేయాలని కోరారు.

పాఠశాలల్లో వివిధ పోటీలు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 19: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో చిత్రలేఖనంతో పాటు వివిధ క్రీడాపోటీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.మిల్కా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న నిర్వహించనున్న బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తూ చిత్రలేఖన, క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

నేరడిగొండ, జనవరి 19: ఈ నెల 22న అయోధ్యలో భవ్య శ్రీరామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా నేరడిగొండలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి శుక్రవారం పెద్ద హనుమాన్ ఆలయం వద్ద హనుమాన్ ఆలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందిరం వద్ద ఆ రోజున ఆధ్యాత్మిక కార్యక్రమాలు, శ్రీరామ అని 1100 దీపాలతో దీపోత్సవం, అన్నదాన కార్యక్రమం, అయోధ్య నుంచి వచ్చిన రథయాత్ర వెంట శ్రీ రామ నామం పలుకుతూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ పెంట వెంకటరమణ, హిందు సంస్థల నాయకులు ఉన్నారు.

ఫొటో ఓటరు జాబితాకు ప్రత్యేక చర్యలు

● జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ● వీసీ ద్వారా ఓటరు జాబితా-2024పై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సమీక్ష ● పాల్గొన్న జిల్లా అధికారులు



ఆదిలాబాద్ అర్బన్, జనవరి 19: స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఫొటో ఓటరు జాబితా కార్యక్రమం-2024పై ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఫొటో ఓటరు జాబితా కార్యక్రమం అధికారుల సమన్వయంతో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కొరకు 6, 7, 8వ ఫారముల ద్వారా అందిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి వివరాలు నమోదు చేయడం జరుగుతుందని, జిల్లాలో 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు తమ వివరాలు జాబితాలో నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో నూతన ఓటరు నమోదు కోసం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే మరణించిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి వారి పేర్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సర్వీసు ఓటర్ల నమోదుతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా విధులు కేటాయించేందుకు సిబ్బంది వివరాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం : ఉట్నూర్ సీఐ



● ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న ఉట్నూర్ సీఐ రామకృష్ణ

ఇంద్రవెల్లి, జనవరి 19: సమాజ శ్రేయస్సు, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల వ్యవస్థ నిరంతరం పాటు పడుతుందని, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని ఉట్నూర్ సీఐ రామకృష్ణ అన్నారు. అయోధ్యలోని నూతన రామాలయంలో ఈ నెల 22న బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో హిందూ, ముస్లిం మత పెద్దలతో వేర్వేరుగా శాంతి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలంతా కలిసిమెలసి ఉండాలని, ఒకరికొకరు సోదరభావంతో పనిచేయాలన్నారు. ఉత్సవాలు జరుపుకునే సమయంలో మరో మతం వారికి ఇబ్బంది కలిగించరాదన్నారు. మత విద్వేశాలు రెచ్చగొట్టడం, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, వివిధ మతాలకు చెందిన కుల పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ఒకరి మతాన్ని ఇంకొకరు గౌరవించుకోవాలని కోరారు. చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. సోషల్ మీడియాలో ఇతర మతస్తుల పట్ల అసభ్యకరమైన పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిజెలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఏమైనా సంఘటనలు జరిగితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సయ్యద్ ఇమ్రాన్, సిబ్బంది హిందూ మత పెద్దలు పాల్గొన్నారు.

● ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి : ఇచ్చోడ సీఐ

గుడిహత్నూర్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇచ్చోడ సిఐ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శ్రీరామ మందిరం ప్రారంభం సందర్భంగా హిందూ మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు.

నేరడిగొండ: ఈనెల 22న అయోధ్యలో రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన సంబరాలను మండలంలో శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై సాయన్న కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించగా స్థానిక హిందూ వాహిని కార్యకర్తలు హాజరయ్యారు. దీనిలో భాగంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా యువకులు సంబరాలను శాంతియుతంగా జరుపుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిసత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



గుడిహత్నూర్‌లో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్



నేరడిగొండలో మాట్లాడుతున్న ఎస్సై సాయన్న



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లంబాడాలకు ఎస్టీ ప్రయోజనాలను నిలిపివేయాలి : ఆదివాసీ సంక్షేమ పరిషత్

ఉట్నూర్, జనవరి 19: తెలంగాణ ప్రాంతాల బడులకు ఎస్టీ ప్రయోజనాలు తాత్కాలికంగా నిలిపి వేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆడ శంకర్, ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావులు ఐటీడీఏ పీవోను కోరినట్లు తెలిపారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంత లంబాడాలకు గిరిజన హోద కల్పించిన పద్ధతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 3002 ప్రకారం లేదని 108/1976 హైకోర్టులో, సుప్రీం కోర్టులో ఆదివాసుల తరపున కేసు పెట్టామని, కేసు సుప్రీం కోర్టులో ఉన్నందున ఎస్టీ ప్రయోజనాలు లంబాడాలకు తాత్కాలికంగా నిలిపి వేయాలని కోరామన్నారు. 2011లోనే ఆదివాసీ సంఖ్య పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో లంబాడాలు ఎస్టీలు కాదని హైకోర్టు లోకేష్ తీర్పు దశకు ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారులు ఫారెస్టు పంచాయతీ రెవెన్యూ అధికారులు కర్ల పత్రాలు జారీ చేయడం సరైన మార్గం కాదని అన్నారు. షెడ్యూల్డు ప్రాంత ఉద్యోగ నియమాల్లో లంబాడాలను మినహాయించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు సైతం ఇవ్వరాదని, షెడ్యూల్డు ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలలో మైదాన ప్రాంతాల లంబాడాలకు ప్రవేశం కల్పించవద్దని, షెడ్యూల్డు ప్రాంతంలో సర్పంచ్ ఉప సర్పంచ్‌ల పదవికి లంబాడాలు అనర్హులని, వీరికి పోడు పట్టాలను ఇవ్వరాదన్నారు. ఇందులో సెడ్మకి భగవంతరావు, ఓమేశ్వర్, జైతు, శంభు, మారుతి, ఇస్రో జాలీషా, గోవిందరావు, ప్రభు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం పెట్టాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 19: ప్రతీ సంవత్సరం అధికారికంగా జరుపుకునే గణతంత్ర దినోత్సవం వేడుకల్లో ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం ఉంచి వేడుకలు జరుపుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. రాజ్యాంగాన్ని రచించి ఈ దేశానికి దశా దిశా చూపిన మహనీయుడు అంబేడ్కర్ చిత్రపటం కాకుండా కొంతమంది అధికారులు ఇతర వ్యక్తుల చిత్రపటాలను పెట్టి వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో నాయకులు మల్యాల మనోజ్ మాదిగ, నక్క రాందాస్ మాదిగ, జువ్వాక నర్సింహులు మాదిగ, లింగంపల్లి ప్రసన్న కుమార్ మాదిగ, కత్తి గంగాధర్ మాదిగ, తదితరులు ఉన్నారు.

'నర్సరీల నిర్వహణను పూర్తి చేయండి'

బోథ్, జనవరి 19: గ్రామ పంచాయతీలలో నర్సరీల నిర్వహణను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు క్షేత్రస్థాయి సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇందులో ఎంపీఈవో జీవన్‌రెడ్డి, ఏపీవో జగదేరావు, తదితరులు పాల్గొన్నారు.